క్లుప్తంగా

కొండమల్లీశ్వరునికి విశేషపూజలు



విశేషాలంకరణలో స్వామివారు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వేకువ జామున స్వామివారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్వామివారికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారికి విశేషాలంకరణ చేసి, భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఆలయం ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

3న గూడూరులో మహాసభ



మహాసభల పోస్టర్లను విడుదల చేస్తున్న ఫెడరేషన్ నాయకులు

పుత్తూరు రూరల్: వీధి వ్యాపారులు తమ సమస్యల పరిష్కారం కోసం మార్చి 3వ తేదీన గూడూరులో నిర్వహించే తిరుపతి జిల్లా మహాసభకు ప్రతి చిరు వ్యాపారి హాజరు కావాలని వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివ కోరారు. ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ వీధి వ్యాపారులు నాణ్యమైన నిత్యవసర వస్తువులను సరసమైన ధరలకు విక్రయిస్తూ ప్రజలకు ఎంతో మేలు చేకూరుస్తున్నారని చెప్పారు. రోజువారీ వసూళ్ల పేరిట దోపిడీకి గురవుతున్నారన్నారు. వీధి వ్యాపారుల కోసం 2014లో తీసుకొచ్చిన చట్టాన్ని క్రమబద్ధీకరించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌కుమార్, నాయకులు శ్రీనివాసులు, సరిత, నజీర తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి



మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షుడు

నగరి : సహకార సంఘాల్లో ఎరువులను అందుబాటులో ఉంచాలని సహకార సంఘం యూనియన్ అధ్యక్షుడు కే విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం నగరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి విచ్చేసిన ఆయన సీఈఓ, సిబ్బందితో సమావేశమయ్యారు. నగరి పరిసర ప్రాంతాల్లో రైతులకు ఎరువులు అవసరం ఉందన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ కార్యదర్శులు తులసి పిళ్లై, కె.రమేష్ పాల్గొన్నారు.

హంస వాహనంపై సుబ్రమణ్యేశ్వరస్వామి



హంస వాహనంపై స్వామి,అమ్మవార్లు

పుత్తూరురూరల్: సుబ్రమణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి అమ్మవార్లు హంస వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. హరోంహర నామస్మరణతో ఆలయ ప్రాంగణం హోరెత్తింది. సాయంత్రం స్వామి అమ్మవార్లతో కలిసి హంస వాహనంలో పురవీధుల్లో విహరించారు. స్వామివారికి ఇంటింటా కర్పూరహారతులిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త సుందరం పర్యవేక్షించారు.

దర్జీలకు చేదోడు

దుస్తులతో మనిషికి అందం.. హుందాతనం తెచ్చే కళాకారులు.. వస్త్రానికి మంచి ఆకృతి నిచ్చి, మానవుడి సౌందర్యం రెట్టింపు చేసే కళాత్మక సైనికులు దర్జీలు. రెడీమేడ్ దుస్తుల ప్రవేశం.. పలు ఫ్యాషన్లు.. డిజైన్లు సరసమైన ధరలకే లభ్యం. ఫలితంగా దర్జీలకు కష్టాలు.. వెరసి మూడేళ్ల ముందు అధికారంలోకి వైఎస్సార్ సీపీ రావడం.. కష్టాల్లో ఉన్న దర్జీలకు చేదోడు నివ్వడంతో వారి బతుకుల్లో వెలుగులు నిండాయి. నేడు ప్రపంచ టైలర్ల దినోత్సవం సందర్భంగా దీనిపై కథనం.

- చేదోడు పథకంతో దర్జీలకు చేయూత
- సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న టైలర్లు
- నేడు ప్రపంచ టైలర్లు దినోత్సవం



కుట్టుపనిలో ఉన్న మహిళలు

పాలసముద్రం : సమాజంలో వ్యక్తి హోదాను సూచించేది వారు ధరించే వస్త్రాలే. ఆ వస్త్రాలు కుట్టే దర్జీలకు ఒకప్పుడు ఊపిరి సలపడానికి సమయం ఉండేది కాదు. కానీ నేడు మార్కెట్‌లోకి తక్కువ ధరకే రెడీమేడ్ దుస్తులు అందుబాటులోకి వచ్చాయి. దీంతో దర్జీలకు పని దొరకడం కష్టమైందన్నది నాటి మాట. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం 2021 నుంచి జగనన్న చేదోడు పథకం ద్వారా అర్హులైన దర్జీల ఖాతాలో ఏడాదికి రూ.10 వేల వంతున సర్కారు జమ చేస్తోంది. దీంతో వారి జీవితాల్లో వెలుగులు నిండాయి. నాడు దర్జీ వృత్తి వదలి ఇతర పనులకు వెళ్లిన వారందరూ మళ్లీ కుట్టు పనులు చేసుకుని, హాయిగా జీవనం సాగిస్తున్నారు. పథకం అమలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నారు. పాలసముద్రం మండలంలో దర్జీలకు జగనన్న చేదోడు పథకం కింద గత ఏడాది 150 మంది, ఈ ఏడాది 245 మంది రూ.10 వేలు వంతున ఆర్థిక సాయం అందుకున్నారు.

దర్జీల పితామహుడు విలియమ్స్ హావే

దర్జీల పితామహుడు జర్మనీ దేశస్తుడైన విలియమ్స్ హావే 1846లో కుట్టు మిషన్ కనిపెట్టారు. అది నిముషానికి 250 కుట్లు వేసేది. అలా తయారైన కుట్టు మిషన్ రూపాంతరం చెంది నేడు ఎలక్ట్రిక్ కుట్టు మిషన్లు వచ్చాయి. దీంతో ఎంతో మంది ఉపాధి పొందుతున్నారు. 1867 విలియమ్స్ హావే ఈ లోకం వదలినా, ఆయన పేరు స్మరించుకుంటూ దర్జీలందరూ ఆయన పుట్టిన రోజైన ఫిబ్రవరి 28వ తేదీని ప్రపంచ టైలర్స్‌డేని జరుపుకుంటున్నారు.

దర్జీలను ఆదుకోవాలనే ఆలోచన వైఎస్సార్‌దే

చేతనైన వృత్తిని వదలలేక, కొత్త వృత్తిని చేపట్టలేక దర్జీలు సతమతమవుతున్న తరుణంలో వైఎస్సార్ వారి జీవితాల్లో వెలుగులను ప్రసాదించేందుకు 2009 మార్చి ఒకటో తేదీన జీఓ ఎంఎస్ నంబర్ 86 విడుదల చేశారు. చెన్నై, కేరళ ప్రభుత్వాల తరహాలో రాష్ట్రంలో కూడా దర్జీలకు సదుపాయాలు అందజేయాలని ఆకాంక్షించారు. 2009 మే14న రాష్ట్ర ప్రభుత్వం 283బీ, 12008–2 ద్వారా ఆంధ్రప్రదేశ్ దర్జీలను కో–ఆపరేషన్ సొసైటీ ఫెడరేషన్‌గా ప్రతిపాదించింది. దీంతో రాష్ట్రంలోని దర్జీలకు ప్రయోజనం చేకూరుతుందని తలచి, వైఎస్సార్ పారిశ్రామిక ఫెడరేషన్ ఏర్పాటుకు ఆదేశించారు. జీఓ జారీ చేసిన తరువాత రూ.కోటి నిధుల కూడా కేటాయించారు. అయితే వైఎస్సార్ మరణానంతరం ప్రభుత్వాలు చేనేత జౌళి శాఖకు నిధులు కేటాయించకపోవడంతో దర్జీల పరిస్థితుల్లో మార్పు కనిపించలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికార పగ్గాలు చేపట్టిన తరువాత వైఎస్సార్ పథకం ద్వారా దర్జీల ఖాతాల్లో రూ 10 వేలు ప్రతి ఏడాది జమ చేస్తూ వాని జీవితాల్లో వెలుగు నింపారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

2013 ఎన్నికలకు ముందు నాటి వైఎస్సార్ ప్రభుత్వం రూ.కోటితో హైదరాబాద్‌లో ఫెడరేషన్ కార్యాలయాన్ని ప్రారంభించినా దాన్ని టీడీపీ ప్రభుత్వం రద్దు చేసిందని దర్జీలు వాపోతున్నారు. తమ బాధలను అర్థం చేసుకున్న ఒకే ఒక్క ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే దర్జీల సంక్షేమానికి ఆర్థిక సాయం చేస్తున్న ఆయనకు రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

“

ఆర్థికంగా వెసులుబాటు



ఎంతో మంది దర్జీల వృత్తిని మానేయలేక అందులోనే కొట్టుమిట్టాడుతున్నారు. చేతి నిండా పనిలేక ఖాళీగా ఉంటున్న తరుణంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం ఎంతగానో మేలు చేకూర్చింది. దీంతో మాకు ఆర్థికంగా వెసులుబాటు కలిగింది. – వీ ఆరుముగం, దర్జీ, పాలసముద్రం

మా కుటుంబాల్లో వెలుగులు



దర్జీల కష్టాలను గుర్తించిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి తొలి బడ్జెట్‌లోనే మా సంక్షేమానికి నిధులు కేటాయించి, మా కుటుంబాల్లో వెలుగులు నింపారు. మా బాధలను గుర్తించిన మొదటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే, ఆయన చరిత్రలో నిలిచిపోతారు. చేదోడుతో అర్హులైన దర్జీలకు మేలు కలిగింది. – భోగరాజ్, టైలర్, ఎస్‌కేఆర్ పురం

ఉపయోగకరం



మార్కెట్‌లోకి రెడీమేడ్ దుస్తులు రావడంతో టైలర్లకు పని తగ్గింది. కుటుంబ పోషణ కష్టమవుతోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టగానే టైలర్లకు ఇచ్చిన ఏడాది రూ.10 వేలు ఆర్థికసాయంతో చాలా ఉపయోగపడింది. మాకు కొంత ఉపశమనం లభించింది. – సుబ్రమణ్యం, టైలర్, కన్నికాపురం

అర్హులందరికీ జగనన్న చేదోడు



చాలా రోజులుగా కష్టాల్లో ఉన్న టైలర్లకు ఆదుకోవడానికి జగనన్న చేదోడు పథకం కింద ఏడాదికి రూ.10 వేలు చొప్పున ప్రభుత్వం వారి ఖాతాల్లో నగదు జమ చేస్తోంది. అర్హులందరికీ జగనన్న చేదోడు పథకం వర్తింపజేయడానికి సచివాలయంలో ఆన్‌లైన్ చేస్తున్నాం.
– కే ఉమావాణి, ఎంపీడీఓ, పాలసముద్రం

ప్రధాని ప్రసంగం ప్రత్యక్ష ప్రసారం



ప్రధాని ప్రసంగాన్ని వీక్షిస్తున్న రైతులు

నింద్ర: మండలంలోని అత్తూరు గ్రామంలో ఆర్బీకేలో తిరుపతి రాస్ విజ్ఞాన కేంద్రం సోమవారం ఢిల్లీలో జరిగిన 13 విడత కిసాన్ నిధుల విడుదల కార్యక్రమాన్ని గ్రామంలోని రైతులకు ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూపించారు. ఈ సందర్భంగా రాస్ విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాసులు మాట్లాడుతూ రైతులకు కేంద్ర ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు దివ్య, రామకుమార్, సర్పంచ్ మలార్, వైస్ ఎంపీపీ దుర్గాదేవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైస్‌ఎంపీపీకి పరామర్శ



పరామర్శిస్తున్న మంత్రి సోదరుడు కుమారస్వామి

నగరి : అనారోగ్య సమస్యతో నగరి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న విజయపురం వైస్ ఎంపీపీ మంజు, బాలాజీ దంపతులను మంత్రి ఆర్కేరోజా సోదరుడు కుమారస్వామి రెడ్డి పరామర్శించారు. సోమవారం ప్రభుత్వాస్పత్రికి వెళ్లిన ఆయన వైస్ ఎంపీపీని పరామర్శించి, ఆరోగ్యం గురించి వైద్యుల్ని అడిగి తెలుసుకుని వారికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు.

గృహసారథులు సైనికుల్లా పనిచేయాలి

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



జీడీనెల్లూరు: మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

గంగాధరనెల్లూరు: గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, క్షేత్రస్థాయిలో సైనికుల్లా పనిచేసి వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి పిలుపునిచ్చారు. మండలంలోని ఎస్ఎస్‌కొండలో ఉన్న ప్రసన్నపార్వతీపరమేశ్వరుని కల్యాణ మండపంలో సోమవారం పార్టీ మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి అధ్యక్షతన గృహసారథులకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, దిశానిర్దేశం చేశారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన గృహసారథులు క్షేత్రస్థాయిలో పార్టీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్ని తిప్పి కొట్టేలా ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయాలన్నారు. రాబోవు కాలంలో పనితీరు బాగున్న గృహసారథులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాల్లో గృహసారథులు భాగస్వామ్యులైతే పేద ప్రజలకు మరింత మేలు కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జరుగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు హరిబాబు, బేబి, ఏఎంసీ మాజీ చైర్మన్ చిన్నమరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మునిరాజారెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్‌రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఏకాంబరం, మాజీ కన్వీనర్ సురేంద్రరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ బాబునాయుడు పాల్గొన్నారు.

నారా లోకేష్‌కు సవాల్

గ్రామాలకు వస్తే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి పనులను నారా లోకేష్‌కు చూపిస్తానని, లేదంటే రాజకీయ సన్యాసం తీసుకుంటానని డిప్యూటీ సీఎం సవాల్ విసిరారు. తాము వేసిన రోడ్ల మీద నడుస్తూ శిలాఫలకాలను విరిచేస్తూ ప్రజల్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు.

బాధిత కుటుంబాల పాలిట దేవుడు జగనన్న



కార్వేటినగరం: చెక్కు అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి

కార్వేటినగరం: బాధిత కుటుంబాల పాలిట దేవుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. పద్మసరస్సు ఎస్టీ కాలనీలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సునీత, గాయపడిన ఉదయ్‌కిరణ్ కుటుంబాలకు సీఎం సహాయనిధి కింద రూ.7.50 లక్షల చెక్కును సోమవారం బాధిత కుటుంబాలకు అందజేశారు. మంత్రి వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, పార్టీ మండల కన్వీనర్ ధనంజయవర్మ, వెంకటేష్, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీపతి పాల్గొన్నారు.

అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



సారెను ఊరేగింపుగా తీసుకువెళుతున్న ఉభయకర్తలు

శ్రీరంగరాజపురం: మండలంలోని మంగుంటలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం అంకురార్పణతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. వేకువ జామున ఆలయంలో అర్చక బృందం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అభిషేక పూజలు చేశారు. సాయంత్రం ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు చేసి, ధ్వజారోహణం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మార్చి 8వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. ప్రతి రోజు ఉదయం 9 గంటలకు హోమం, 11గంటలకు అభిషేకం, సాయంత్రం 4 గంటలకు కల్యాణోత్సవం , 6 గంటలకు వాహన సేవ, 8 గంటలకు ఊంజల్‌సేవ నిర్వహిస్తామని చెప్పారు. రోజు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, అన్నదానం చేస్తామన్నారు. ఉత్సవాలకు ఉభయకర్తలుగా సుబ్రమణ్యంరెడ్డి, జయచంద్రారెడ్డి, పెరుమాల్ రెడ్డి, శేఖర్ రెడ్డి, లోకనాథరెడ్డి తదితరులు వ్యవహరించారు.

గృహనిర్మాణ పనులు వేగవంతం చేయాలి



గృహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఎస్ విద్యావతి

పాలసముద్రం : మండలంలో ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాల్సిన బాధ్యత సంబంధిత ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై ఉందని ఎంపీడీఓ విద్యావతి తెలిపారు. సోమవారం ఇంజినీరింగ్ అసిస్టెంట్‌తో కలసి తొట్టికండ్రిగ జగనన్న లేఅవుట్‌లో గృహ నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఎంపీడీఓ విద్యావతి మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహనిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వం పక్కా ఇళ్లకు ఉచితంగా ఇసుక, తక్కువ ధరకు సిమెంట్, సకాలంలో బిల్లులు ఇస్తుందని చెప్పారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు లబ్ధిదారులకు అవగాహన కల్పించి, పనులు పూర్తి చేయించాలని సూచించారు. జగనన్న లేఅవుట్లలో తాగునీరు, రోడ్డు, విద్యుత్ కొరతలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శులు హరి, సుధాకర్ పాల్గొన్నారు

పెరటి కోళ్ల పెంపకంతో అధిక ఆదాయం

పాలసముద్రం : మండలంలోని డ్వాక్రా సంఘాల సభ్యులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పెరటి కోళ్ల పెంపకంతో మంచి ఆదాయం పొందవచ్చని వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ తెలిపారు. శుక్రవారం పాలసముద్రం సచివాలయ ఆవరణలో ఎంపీడీఓ ఎస్ విద్యావతి ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాల సభ్యులకు పెరటి కోళ్ల యూనిట్లు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ మాట్లాడుతూ రూ.3 వేలు విలువ చేసే 11 కోళ్లు ఉన్న యూనిట్‌తోపాటు మెడికల్ కిట్‌ను కూడా ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. పెరటి కోళ్ల పెంపకంతో మంచి ఆదాయం వచ్చి మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్‌లు అయ్యప్ప, నరసింహరాజు, జీవిత, శోభ, ఎంపీటీసీ సభ్యుడు గోవిందరాజులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు నిర్మూలించాలి



ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు

పాలసముద్రం : మాతాశిశు మరణాలు అరికట్టాలంటే, బాల్యవివాహాలు నిర్మూలించాలని శ్రీకావేరిరాజుపురం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్యామలమ్మ, సర్పంచ్ గాలిమహేష్ బాబు తెలిపారు. సోమవారం పంచాయతీ కార్యదర్శి సునీత, అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో బాల్య వివాహాలు చేయడంతో కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్న వయసులో వివాహం చేయడంతో ప్రసవం సమయంలో పలు తలెత్తే అవకాశం ఉందని చెప్పారు. బాల్యవివాహం చేయడంలో ఆడపిల్లలు చాలా సమస్యలు ఎదుర్కొవాల్సి వస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో బాల్యవివాహలను అరికట్టాలని తెలిపారు. అనంతరం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్యామలమ్మ, ఉపాధ్యాయుడు ఏలుమలై, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్ల నిషేధానికి అందరు సహకరించాలి



దుకాణ యజమానికి నోటీసు అందజేస్తున్న అధికారులు

పాలసముద్రం : మండలంలోని దుకాణ యజమానులందరూ ప్లాసిక్ట్ కవర్లు నిషేధానికి సహకరించాలని మండల విస్తరణాధికారి రమేష్ తెలిపారు. సోమవారం బలిజకండ్రిగలో ఉన్న దుకాణ యజమానులకు పంచాయతీ కార్యదర్శి శంకర్, సచివాలయ సిబ్బంది కలసి నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పర్యావరణానికి హాని కలిగే ప్లాస్టిక్ కవర్లు, పాలిథిన్ కవర్ల నిషేధించాలని నిర్ణయం తీసుకుందన్నారు. ఈ క్రమంలో దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు వినియోగించకూడదని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ నుంచి దుకాణ యజమానులు ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అనంతరం దుకాణ యజమానులకు నోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయాలు.. ఆర్ అండ్ బీ రోడ్లు



ప్రమాదాలకు నిలయంగా ఉన్న మట్టిదిబ్బలు

కార్వేటినగరం: ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యంతో రోడ్లు ప్రమాదాలకు నిలయాలుగా మారాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. కార్వేటినగరం సమీపంలోని చిన్నకనుమ, పెద్ద కనుమ వద్ద కనీసం ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహన చోదకులు తరచు ప్రమాదాలకు గురవుతున్నారని చెబుతున్నారు. రెండు నెలల వ్యవధిలోనే మూడు ప్రమాదాలు చోటు చేసుకున్నాయని, అందులో ఒక్కరూ ప్రాణాలు కోల్పోయారని చెబుతున్నారు. దీనికి తోడుగా అటవీశాఖ కార్యాలయం సమీపంలో రోడ్లపై మట్టి దిబ్బలను వేయడంతో వాహనాలు రాక పోకలకు ఇబ్బందికరంగా మారిందని, అదే ప్రాంతంలో రోడ్డు నిర్మాణం సరిగా చేపట్టకపోవడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు దారి సరిపోక డ్రైవర్లకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యం వీడి, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రోడ్లపై వేసిన మట్టి దిబ్బలను తొలగించి ప్రమాదాలను నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు అంటున్నారు.

నాడు కష్టం.. నేడు సుఖప్రయాణం



నాడు అధ్వానంగా ఉన్న ఉగ్రాణంపల్లె రోడ్డు



పునర్నిర్మాణం తరువాత ఇలా..

పెనుమూరు(కార్వేటినగరం): మండలంలోని ఉగ్రాణంపల్లె నుంచి పెనుమూరుకు వెళ్లే రోడ్డు కొ న్ని దశాబ్దాలుగా గుంతలమయంగా మారి రాక పోకల కు ఇబ్బందికరంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంట ఉగ్రాణంపల్లె వాసులు రోడ్డు సమస్యను డిప్యూటీ సీఎం నారాయణస్వామి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన రోడ్డు పునర్నిర్మాణంతోపాటు కల్వర్టులు కట్టడంతో నేడు వాహన చోదకులు హాయిగా ప్రయాణిస్తున్నారు. టీడీ పీ అధికారంలో ఉన్నంత కాలం రోడ్డు బాగు చేయా లని పలుసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని, అడగక ముందే సమస్యను పరిష్కరించి మాట నిలబెట్టుకున్న ప్రభుత్వానికి, డిప్యూటీ సీఎంకు రుణపడి ఉంటామని గ్రామస్తులు తెలిపారు.

కబడ్డీ పోటీల్లో రన్నర్‌గా పాలసముద్రం జట్టు

పాలసముద్రం : మండలంలోని పాలసముద్రం జట్టు కబడ్డీ పోటీల్లో రన్నర్‌గా నిలిచి, ద్వితీయ బహుమతి అందుకుందని సోమవారం కెప్టెన్ ఇళయరాజ్ తెలిపారు. నారాయణవనం మండలం జీఎస్ కండ్రిగలో ఈ నెల 25, 26వ తేదీల్లో జరిగిన కబడ్డీ టోర్నమెంట్ ఫైనల్స్‌లో జీఎస్‌కండ్రిగ, పాలసముద్రం జట్లు తలపడ్డాయి. ఈ పోటీల్లో జీఎస్‌కండ్రిగ జట్టు విజయం సాధించగా, పాలసముద్రం జట్టు రన్నర్‌గా నిలిచి, ద్వితీయ బహుమతి రూ.5 వేలు అందుకుందని చెప్పారు. టోర్నమెంట్‌లో 25 జట్లు పాల్గొన్నాయని తెలిపారు. నగదు బహుమతిని కిరణ్‌కుమార్ చేతుల మీదుగా అందుకుందని పేర్కొన్నారు.